క్లుప్తంగా

అంబికాదేవి ఉత్సవాలు ప్రారంభం



అక్కుపల్లిలో అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని అక్కుపల్లిలో వెలసిన గ్రామ దేవత అంబికాదేవి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మొదటి రోజు మరిడమ్మకు ప్రత్యేక పూజలు చేసి మేళతాళాల నడుమ ఊరేగించారు. అలాగే అదే రాత్రి నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అలాగే మండలంలోని చీపురపల్లి పంచాయతీ పరిధి ఎం.గడూరులో వెలసిన సంధ క్కమ్మ ఉత్సవాలు మొదలయ్యాయి. దీనిలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారి చల్లదన మహోత్సవం



చల్లదనం నిర్వహిస్తున్న దృశ్యం

కవిటి: మండలంలోని బి.గొనపపుట్టుగ గ్రామంలో బాలమణి అమ్మవారి చల్లదన మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాళీ వేషధారణతో తిరువీధులు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి వితరణ



వృద్ధులకు నగదు అందజేస్తున్న క్రికెట్ జట్టు సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని చీకటి బలరాంపురంలో ఇటీవల జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన ఇచ్ఛాపురం జట్టు, తమకు దక్కిన రూ.5 వేలు నగదును గిన్ని సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న వృద్ధాశ్రమానికి వితరణగా అందజేశారు. ఆదివారం క్రికెట్ జట్టు సభ్యులంతా కలిసి నగదును వృద్ధులకు అందజేసి, పెద్ద మనసు చాటుకున్నారు.

ఆర్థిక సాయం అందజేత



సంతోషికి సాయమందిస్తున్న సంస్థ సభ్యులు

మందస: పట్టణంలోని దండాసి వీధికి చెందిన సంతోషికి పవనపుత్ర సేవాసంస్థ సభ్యులు ఆదివారం రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. నిలువ నీడలేని సంతోషి కుటుంబానికి దాతలు ఇల్లు నిర్మిస్తున్నారు. సంస్థ వ్యవస్థాపకుడు మజ్జి భాస్కరరావు, అధ్యక్షుడు కొల్లి ఫల్గుణరావు, ఒడిసి యోగేశ్వరరావు, చెల్లూరి సింహాచలం, పల్లి ధనుంజయ, కోటేశ్వరరావు, అనిల్‌కుమార్, కిషోర్, విశ్వనాథం తదితరులు సాయమందించిన వారిలో ఉన్నారు. కాగా, కష్టాల్లో ఉన్నవారు తమను సంప్రదించాలని వారు కోరారు.


క్రికెట్ టోర్నమెంట్ విజేత మాకన్నపల్లి



విజేత మాకన్నపల్లి జట్టుతో నిర్వాహకులు

కాశీబుగ్గ: పలాస మండలం మాకన్నపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న క్రికెట్ మైదానంలో ప్రయోగాత్మకంగా నిర్వహించిన ఉద్దాన క్రికెట్ టోర్నమెంట్ విన్నర్‌గా మాకన్నపల్లి జట్టు, రన్నర్స్‌గా పెద్ద నీలావతి జట్టు నిలిచాయి. రెండు జట్లకు ట్రోఫీలతో పాటు నగదు బహుమతి అందజేశారు. త్వరలోనే మైదానం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని నిర్వాహకులు తెలియజేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



నవదుర్గల నృత్యం ప్రదర్శన

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని స్వర్ణాపురంలో చింతల పోలమ్మ తల్లి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు కోలాటం, నవదుర్గల విన్యాసం, కాళీమాత నృత్యం, గారడీ విన్యాసాలు అలరించాయి.

కార్యకర్తలే పార్టీకి బలం

- ఎన్నికలకు సైనికుల్లా పనిచేయాలి
- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
- పాత టెక్కలిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం



మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు: నిబద్ధత కలిగిన కార్యకర్తలే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలమని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని పాత టెక్కలి గ్రామంలో నూతనంగా నిర్మించిన పార్టీ కార్యాలయాన్ని మండల పార్టీ అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్య నాయుడు చేతులమీదుగా ఆదివారం ప్రారంభింపజేశారు. అనంతరం ఎంపీటీసీ బాలక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేట్‌కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీదిరి మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో విజయం కోసం పార్టీ కార్యకర్తలంతా సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. పాత టెక్కలిని ఆదర్శంగా తీసుకొని ప్రతీ గ్రామంలో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేందుకు కార్యకర్తలు, గృహ సారథులు, వలంటీర్లు కృషి చేయాలన్నారు. బాలక శ్రీనివాసరావు తన సొంత నిధులు వెచ్చించి పార్టీ కార్యాలయాన్ని నిర్మించడం గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, పలాస- కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, స్థానిక సర్పంచ్ తుంగాన సుశీల, ఉప సర్పంచ్ జల్లు శశిభూషణరావు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు జె.ఉషారాణి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దాసరి దాలయ్య, పి.షణ్ముఖరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొల్లి జోగారావు, పార్టీ నాయకులు ఎం.శ్రీనివాస భాగవతార్, సర్పంచ్ అట్టాడ గోపి, చింత హేమారావు, చింత రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- కంచిలిలో గడప గడపకూ మన ప్రభుత్వం

కంచిలి: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. కంచిలి 1వ సచివాలయం పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలను తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో రాష్ట్ర భవిష్యత్ కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. సీఎంకు అండగా ప్రజలంతా నిలవాలని కోరారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయం, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రాందాస్, ఆర్‌బీకే చైర్మన్ లడ్డు కేశవ్ పాత్రో, ఏఎంసీ చైర్మన్ ఎస్.బాబురావు, జేసీఎస్ ఇన్‌చార్జి కొనపల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'కేన్సర్‌పై అవగాహన అవసరం'

టెక్కలి: ప్రాథమిక స్థాయిలో కేన్సర్‌ను గుర్తించే విధంగా గ్రామీణ వైద్యులు అవగాహన కలిగి ఉండాలని విశాఖపట్నం మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి వైద్యుడు వి.మురళీకృష్ణ సూచించారు. కేన్సర్ వ్యాధి గుర్తింపుపై పట్టణంలో గ్రామీణ వైద్యులకు అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాన్, గుట్కా, కల్తీ ఆహారం వలన అధికంగా కేన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. కేన్సర్ రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఇటీవల డాక్టరేట్ అందుకున్న గ్రామీణ వైద్యుల సంఘం ప్రతినిధి సత్తారు రాజశేఖర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎ.వెంకట్రావు, యాదవ్‌రావు, రమణ, దీనబంధు, దినేష్, శంకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



రాజశేఖర్‌ను సన్మానిస్తున్న డాక్టర్ మురళీకృష్ణ తదితరులు

మారుమూల గ్రామాలకు రహదారులు

కాశీబుగ్గ: వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రస్తుతం మారుమూల గ్రామాలకు సైతం రహదారుల నిర్మాణాలు చేపడుతున్నారని బంటుకొత్తూరు పంచాయతీ సర్పంచ్ పిట్ట షణ్ముఖరావు అన్నారు. పెద్ద నారాయణపురం గ్రామంలో ఆదివారం రూ.2.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ సమావేశంలో ప్రస్తావన మేరకు ప్రాధాన్యత నిమిత్తం పనులు మంజూరవుతుండడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో పలాస పీఏసీఎస్ అధ్యక్షుడు పైల వెంకటరావు, జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యదర్శి ఉంగ సాయికృష్ణ, దంతం వైకుంఠరావు, కోనారి మాధవరావు, పిట్ట నరేష్, ఆనెం రామారావు, గరికి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ షణ్ముఖరావు తదితరులు

'బైకు దొంగతనాలపై చర్యలు తీసుకోవాలి'

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో గత కొన్ని రోజుల నుంచి వరుసగా ద్విచక్ర వాహనాల దొంగతనాలు జరుగుతున్నాయని, దీనిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ కో-ఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కొద్ది రోజులుగా చర్యలు చేపట్టకపోవడంతో దొంగలు రెచ్చిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ఇటువంటి సంఘటనలకు గురైన బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకొని, ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ చేయాలని కోరారు.

వేసవి విజ్ఞాన శిబిరాలతో మేలు



సంతబొమ్మాళి: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో చిన్నవాడు



కంచిలి: మాట్లాడుతున్న ఎంపీపీ దేవదాస్ రెడ్డి

టెక్కలి: వేసవి సెలవుల్లో శాఖా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులకు మేలు జరుగుతోందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చింతాడ మంజు అన్నారు. టెక్కలి శాఖా గ్రంథాలయంలో మే 8 నుంచి ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిబిరాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా 35 రోజుల పాటు విజ్ఞాన శిబిరంలో పాల్గొని ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు ఎన్.భాస్కరరావు, జి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మందస: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి ప్రత్యేక శిబిరం ఆదివారంతో ముగిసింది. లైబ్రేరియన్ జె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో విద్యార్థులకు కోచింగ్, పుస్తక పఠనం, వివిధ రకాలైన పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చెరుకుపల్లి యల్లమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సీహెచ్ లక్ష్మణమూర్తి, శ్రీరాజాశ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లఖినాన సాంబమూర్తి, పీడీ రవికుమార్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: మండలంలోని సంతబొమ్మాళి, నౌపడ శాఖా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలిపొందిన విద్యార్థులకు విద్యాశాఖాధికారి జలుమూరు చిన్నవాడు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శాఖా గ్రంథాలయాధికారులు కె.రామకృష్ణ, రూపావతి, పీఏసీఎస్ డైరెక్టర్ పి.రవికుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఎల్.జయకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంచిలి: విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి అన్నారు. కంచిలి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ముగింపు వేడుకలు ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకుంటే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చునన్నారు. వివిద పోటీల్లో గెలిపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇప్పిలి కృష్ణారావు, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ముగిసింది. గ్రంథాలయ అధికారి వై.రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పలాస మండల అధికారి సీహెచ్ శ్రీనివాసరావు విచ్చేశారు. ఈ సందర్భంగా చిన్నారులతో కథలు చదివించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్పోకెన్ ఇంగ్లిష్ టీచర్ జి.నాగేశ్వరరావు, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



కాశీబుగ్గ: బహుమతులతో చిన్నారులు



మందస: విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



టెక్కలి: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మంజు తదితరులు

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కవిటి: మండలంలోని రాజపురం ఏపీ మోడల్ స్కూల్‌లో 2023-24 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశాలకు సంబంధించిన ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. చీఫ్ సూపరింటెండెంట్ యు.ఈశ్వరరావు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ మల్లేశ్వరరావులు పరీక్షను పకడ్బందీగా నిర్వహించారు. పరీక్షకు 126 మంది దరఖాస్తు చేసుకోగా, 119 మంది హాజరయ్యారు. పరీక్ష నిర్వహణ తీరును రాష్ట్ర పరిశీలకుడు కంది దర్శికుమార్, సమగ్ర శిక్ష సీఎంవో హరికృష్ణ ఆకస్మికంగా పరిశీలించారు.

జేవీకే విజయవంతం చేయాలి

ఇచ్ఛాపురం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పంపిణీ చేయనున్న జగనన్న విద్యా కానుక(జేవీకే) కిట్లు పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం పిలుపునిచ్చారు. సోమవారం పాఠశాలల పునః ప్రారంభం రోజున నిర్వహించనున్న కార్యక్రమానికి ఉపాధ్యాయులు బాధ్యత వహించాలన్నారు. విద్యార్థులకు యూనిఫాంలు, బ్యాగ్, నోట్‌బుక్స్, షూ, సాక్స్‌లు, బెల్టులు, పాఠ్య పుస్తకాలను జగనన్న విద్యా కానుక ద్వారా ప్రభుత్వం అందజేస్తుందని పేర్కొన్నారు.

మెగా రక్తదాన శిబిరం నేడు

కంచిలి: మండలంలోని తలతంపర గ్రామంలో నిర్వహిస్తున్న సీతయ్య ఫౌండేషన్ 4వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు జి.రమేష్, జి.మోహన్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయాలని కోరారు.

'స్థలం ఆక్రమిస్తే చర్యలు'

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలోని ఆస్పత్రి రోడ్డులో ఉన్న వక్ఫ్ బోర్డు స్థలాన్ని ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తప్పవని పట్టణ ఎస్ఐ గోవిందరావు హెచ్చరించారు. పీర్లపంజా స్థలాన్ని పట్టణానికి చెందిన అమీర్ అలీ అనే వ్యక్తి అతని కుటుంబ సభ్యులతో కలిసి, ఆక్రమించినట్లు పీర్లపంజా ధర్మకర్త బీజాన్ బీబీ వంశీకుడు ఎంఎస్‌హెచ్ రబ్బాని ఫిర్యాదు చేశారు. దీనిపై పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

రైతుల బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న రైతులు

ఇచ్ఛాపురం: నియోజకవర్గం రైతుకులం ప్రతినిధుల ఆధ్వర్యంలో రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇచ్ఛాపురంలో భారీ బైక్ ర్యాలీ ఆదివారం నిర్వహించారు. బెల్లుపడ జామి ఎల్లమ్మ గుడి వద్ద ముందుగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం గుడి వద్ద నుంచి పట్టణంలో ప్రధాన రోడ్డు మార్గం గుండా ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న గ్రామస్తులు

కోటబొమ్మాళి: మండలంలోని పెద్దబమ్మిడి గ్రామానికి చెందిన నల్లపాటి సత్యనారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో ఆయన చికిత్స నిమిత్తం ఆ కుటుంబ సభ్యులకు గ్రామానికి చెందిన గణేష్ యూత్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సంయుక్తంగా రూ.40 వేల విరాళాన్ని ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో గణేష్ యూత్ సభ్యులు కొత్తకోట దుర్గారావు, పల్లి శివ, బొమ్మాళి రవి, కొర్రాయి ఆనంద్, గూట్ల లక్ష్మణరావు, గూట్ల చిన్నారావు, గూట్ల గణపతి తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలి'



కాశీబుగ్గ: ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు



టెక్కలిలో నిరసన చేస్తున్న ప్రజా, కార్మిక సంఘాల నాయకులు

టెక్కలి: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వం తన వైఖరి మార్చుకోవాలని ప్రజా, కార్మిక సంఘాల నాయకులు సూచించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా విశాఖ పర్యటన నేపథ్యంలో మండల కేంద్రంలో నిరసన కార్యక్రమాలు ఆదివారం చేపట్టారు. అమిత్ షా గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకుడు ఎస్.షణ్ముఖరావు మాట్లాడుతూ బీజేపీ పాలనలో అన్నివర్గాల ప్రజలకు నష్టాలను కలిగించారని ఆరోపించారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్‌పరం చేశారని, కార్మిక చట్టాలను తుంగలో తొక్కారని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని దుయ్యబట్టారు. ఇటువంటి బీజేపీ పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎ.షణ్ముఖరావు, కె.ఎల్లయ్య, హెచ్.ఈశ్వరరావు, సూర్యనారాయణ, అప్పన్న, వై.గోపి, నారాయణరావు, భాస్కరరావు, అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పర్యటించే అర్హత లేదు

కాశీబుగ్గ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలు అమలు చేయకుండా అన్యాయం చేసిన బీజేపీ నాయకులకు రాష్ట్రంలో పర్యటించే నైతిక హక్కు లేదని వామపక్ష నాయకులు అన్నారు. అమిత్ షా పర్యటనను వ్యతిరేకిస్తూ పలాస-కాశీబుగ్గ పాత బస్టాండ్ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. సీపీఐ, సీపీఎం, సీపీఐ న్యూడెమోక్రసీ, సీపీఐ లిబరేషన్ నాయకులు సీహెచ్ వేణుగోపాల్, ఎస్.గణపతి, వంకల మాధవరావు, మద్దిల రామారావులు మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేస్తాము, వెనక్కు తగ్గేది లేదని చెబుతున్న బీజేపీ నాయకులు విశాఖలో అడుగు పెట్టేందుకు సిగ్గు లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బీజేపీ నాయకులను ఈ రాష్ట్రంలో తిరగనివ్వకూడదని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు, కార్యకర్తలు ఎం.వినోద్ కుమార్, పాపారావు, షణ్ముఖరావు, కృష్ణ, హమాలీ, ఆటో యూనియన్ నాయకులు బి.ఢిల్లీరావు, మల్లేశ్వరరావు, బాలరాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం



వేంకటేశ్వరస్వామి సన్నిధిలో పిరియా విజయ తదితరులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని బొడ్డభాళీ గ్రామంలో కొలువైన వేంకటేశ్వర స్వామి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు రేజేటి ప్రభాకర్ శర్మ ఆధ్వర్యంలో మేళతాళాలు, మంగళ వాయిద్యాలు నడుమ కార్యక్రమం జరిగింది. స్వామివారిని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యే బెందాళం అశోక్, ఎంపీపీలు బోర పుష్ప, పైలా దేవదాసురెడ్డి, సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, ఎంపీటీసీలు ఆశి మందాకిని, పిట్ట హేమలత, కౌన్సిలర్ బచ్చు జగన్, చాట్ల తులసీదాసురెడ్డి, ఆశి కృష్ణారెడ్డి, కారంగి మోహనరావు, దక్కత నూకయ్యరెడ్డి, పిట్ట మామయ్య, నీలాపు ఢిల్లీ, ఆశి పురుషోత్తమరెడ్డి, బతకల మోహన్‌దాస్‌లు దర్శించుకున్నారు.

● ఆత్మీయ సమ్మేళనం



మండలంలోని బెంకిలి ప్రాథమిక పాఠశాలలో 2001-02 విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి గుర్తులను నెమరువేసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం బారువ సముద్ర తీరానికి చేరుకొని ఉల్లాసంగా గడిపారు. నాటి గురువులు సూర్యనారాయణ, శ్రీనివాస్ పాణిగ్రాహిలను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కె.నేతాజీ, మహేష్, ప్రదీప్, మనోజ్, పురుషోత్తం, తేజేశ్వరరావు, కృష్ణ, అనురాధ, ఆశ, మాధవి, రోజా, కోకిల తదితరులు పాల్గొన్నారు.

– సోంపేట